పండుగ చీర

రాజ్యలక్ష్మి సంధ్యదీపం వెలిగించి తులసిచెట్టు దగ్గరపెట్టి వీధి వాకిట్లోకి వచ్చి గుమ్మానికి ఆనుకుని నిలబడ్డది.

ఎక్కడో ఢామ్మన్న చప్పుడు వినిపించగానే ఉలిక్కిపడి రెండు చెవులూ మూసుకుంది.

ఏమిటో దీపావళి అప్పుడే దగ్గరికి వచ్చేసిందా? అందరికంటె ముందు పిల్లల కాసంగతి బాగా తెలుసు. దీపావళి వస్తోందన్న మాట. రాజ్యలక్ష్మి మనసులో ఏవేవో ఆశలు రెపరెప లాడాయి.

పండుగ! పండుగకో కొత్త చీర ఉండదా. తన కెన్నాళ్ళనుంచో మంచి చీర తన ఇరుగుపొరుగుల దగ్గరలేని చీర వాళ్లు కొనుక్కోలేని చీర– తను కొనుక్కోవాలనీ– పండుగనాడు ఆ చీర కట్టుకుని అందరి మధ్యా తిరగాలనీ– అలా తిరుగుతోంటే వాళ్లు విస్మయంగా చూడాలనీ– 'ఎంతకు కొన్నావు? ఎంతకు కొన్నావు?' అంటూ వాళ్లంతా తన చుట్టూ చేరి అడగాలనీ అప్పుడు తను దాని ధర వాళ్లకందుబాటులో లేదన్నట్టుగానూ కొంచెం నిర్లక్ష్యంగా చెప్పాలనీ ఆమె కోరిక.

ఈ చిన్న కోరిక ఆమె పెళ్లి అయినప్పటి నుంచి తీరకుండా వచ్చింది.

ఆ రాత్రి భోజనాలయ్యేటప్పుడు ఛలోక్తిగా "వింటున్నారా చప్పుళ్లు?" అడిగింది.

అతడు తెల్లబోయి చూశాడు.

"అలా చూస్తారేం? పండుగండీ పండుగ. దీపావళి పండుగ వచ్చేస్తోంది. ఎక్కువ గడువులేదు" అంది

"ఊఁ" అన్నాడు భోజనం ముగించి గ్లాసెడు నీళ్లు తాగుతూ.

"ఊఁ ఏమిటి? దీనిని మీరు సస్పెండ్ చేయటానికి వీలులేదు మరి" అంది అతడికేసి చూస్తూ.

తానెప్పుడూ ఉపయోగించే మాట- సస్పెండు చేయటమనేది- రాజ్యలక్ష్మి నేర్చుకొని ఉపయోగించిందన్న ఆశ్చర్యము కంటె- రాబొయ్యే ఈ పండుగను గురించి పదేపదే జ్ఞాపకము చేయటములోను, దానిని గురించిన ఉపోద్ఘాతము యివ్వటములోను, అతనికేదో మరొక భావము ధ్వనించింది. అసలు నాలుగు దినాల నుంచీ రాజ్యలక్ష్మి మనసులో మాటను మనసులోనే మాయము చేస్తున్నది. తన భావమేమిటో భర్త తెలుసుకోలేదన్నట్లుగా చిరాకు పడిపోతున్నది. ఆమెతో కాపురము చేస్తున్న ఈ నాలుగేళ్ల అనుభవమువల్ల తనకేదో ముప్పు రానున్నదన్న భయము అతని ఎడదలో ఒక మెరుపులా మెరిసింది.

"అప్పుడులే. మనమేమి చేస్తాము? వస్తుంటే చూద్దాము" అని క్లుప్తముగా ముగించాడు సంభాషణ.

"సరేలెండి. నేను అనేదొకటీ మీరు చెప్పేదొకటీను. పాపము, ఏమి ఎరుగని వాళ్లలాగ....అమాయకంగా....అల్లా మాట్లాడుతారేం?" అన్నది. అప్పటికే చిరుకోపము ముఖము మీద కనబడుతున్నది.

దానితో కొంచెం చురుకెక్కింది భావనారాయణుడు. తెలియకపోయినా తెలుసుకున్నట్లుగా మాట్లాడాలని ప్రయత్నించాడు.

"ఏమిటీ అల్లా బాణాలు వదులుతున్నావు? చెప్పు నీకు పుణ్య ముంటుంది మాలక్ష్మకు నేనొక్కడినే సుమా!" అన్నాడు.

"అన్నీ నా నోటిమీదుగా చెప్పించాలని చూస్తున్నట్లున్నారు? పండగ వస్తే ఇంట్లోకి ఏమి కావాలో ఖావ్యకేమి కావాలో మనివాళ్ళను నేనెక్కడ చూడను" అని నిందా గర్భితమయిన వాక్యాన్ని ఒకటి అతనిమీదికి విసిరింది.

"కొంప తీశావు! నేనెన్నో వాడినో కొస్త చెప్పు?" అన్నాడు.

ఎదుటివారికోపమును తానుకూడా కోపదృష్టితోచూసే శక్తి అతనిలో ఇప్పుడు లేదు. ఎంతటి గడ్డుసమస్య నయినా నవ్వుతూ తేల్చిపారవేస్తూ జీవితాన్ని

తేలిక చేసుకోవటము నేర్చుకున్నాడు భావనారాయణ నిజంగా నాన్‌గెజిటెడ్ ఉద్యోగికున్న ఓపిక, శాంతము మరొకరికి ఉండదు. నరాలు అరిగిపోయే చాకిరి చేయాలి గాని విసుగుకుంటే లాభములేదు. శాణపరీక్షకు ఆగిన రత్నాలవలె అనుభవ మెక్కువయిన కొద్దీ శాంతమూర్తులవుతారు.

"మీకు అంతా హాస్యమే. పోనీ మీకంత సరదాగా ఉంటే నానోటిమీదుగానే చెప్తాను లెండి. దీపావళిపండుగకు కొత్తచీరెకట్టుకునే అలవాటు నాకు ఉన్నది. అది నేనే జ్ఞాపకము చేయవలసివచ్చింది. నగలమాట ఈ జన్మలో తలపెట్టటానికి వీలులేని నాకు. మీరు ఒకచీరయినా తీసుకొని రారూ!"

"అదా నీ ఉపాయం! నేనింత చిచ్చుబుడ్డే అడుగుతావో మతాబా అడుగుతావో ననుకుంటున్నాను."

"అప్పుడే మన ఇరుగుపొరుగు అందరూ చీరెలు కొనుక్కున్నారు నాకు మాత్రం చీరె సరదా ఉండదనా? రేపు మావాళ్ళింటికి వెళ్ళినా....అంతా అడుగుతారు ఏం కొనుక్కున్నావని? మీ సంపాదనలో ఒక చీరె అయినా కొనలేరూ?"

"అట్లా చెప్పు! వాళ్ళు వీళ్ళు అంటారనా నాకీశిక్ష విధించటం? అందరి అభిమతాల ప్రకారము మనము నడుచుకోవాలంటే ఒక నిమిషమయినా మన జీవితంలో సుఖమన్న మాట ఉండదు మాటవరుసకు అంటున్నానుగాని వాస్తవ ఆలోచించు, మన సంసారాన్ని నడిపేది మన [illegible] వాళ్ళ అభిమతాలా?"

"మీరెప్పుడూ ఇంతే ఒక సరదాలేదు — ఒక సంతోషమూ లేదు ఏది కావాలన్నా ఒక పెద్దఉపన్యాసమూ, ఒక పెద్ద గొడవాను మనఇంట్లో. కొంత మందికి నోటిమాట నోట్లోనే ఉండగా సరదాలన్నీ తీరుతాయమ్మా చక్కగా! ఇంతవరకూ నేనుచేసిన పూజ మంచిది కాదు" అంటూ కళ్లు తుడుచుకుంటూ లేచింది. ఆమె సంభాషణాకాలము సమాప్తి చెందిందని భావనారాయణ లేచాడు.

ఏమిటి ఈదీపావళిపండుగ! ఏటికి వస్తున్నది? రెండు దినాలు సెలవులని పేరేగాని నాలుగుదినాల వ్రాతపని ఉంటుంది. సెలవు దినాలలో ఖులాసాగా ఇంట్లో కాలక్షేపమూ అంటే భావనారాయణ జన్మకది తలచుకోలేని కోరిక!

* * * *

రాజ్యలక్ష్మి పల్లెటూరిలో పెరిగిన పిల్ల. కూతురు సుఖపడుతుందికదా అని ఆ స్త్రీసంబంధము ఏరికోరీ పట్టుదలతో చేసింది తల్లి.

ఆమె పల్లెటూరి పడుచులవలె ఏమీ ఎరుగనట్టుగా ఉండదు. ఆమె అక్కడ అయిదవక్లాసు పాసయిన విద్యావతి! ఆ స్త్రీలలోని శ్రీలకంటె మిన్నగా నాజూకు లెరిగిన జాణ. నాటకాలు సినిమాలు పార్కు విహారాలు ఆమె మనోవీధిని మెరిసే మెరుపులు. ఏ సినిమాలో ఏతార నటించినదీ వాళ్ళ వేషములతోసహా అనర్గళంగా ఒప్పచెప్పగల తెలివి ఆమెలో ప్రవహిస్తూఉంటుంది. చీనావాళ్ళదగ్గర కొన్న పెద్ద సవరముతో అల్లిన జడ రెండణాలకు తక్కువకాని మల్లెపూలదండ-జడ చివర నలగనిది గజము రిబ్బను పెట్టుకొని రకరకాల స్నోలను ఉపయోగించుకుంటూ.... సినిమాపాటలు పాడుకుంటూ....తారల ననుకరిస్తూ.... ఉంటుంది. సినిమా తారల క్రొత్త పోకడలతో ఆమె తన జీవిత వలయమేర్పరచు కొన్నది.

సరిగా రెండునెలలక్రిందట ఆమె పినతల్లికూతురు వచ్చి నాలుగుదినాలుండి వెళ్ళింది. తాను వచ్చిన యిన్ని సంవత్సరాలకు తన కోరికలన్నీ తీరినవి. రోజూ సాయంకాలము పార్కుకు వెళ్ళటము, సినిమాలకు వెళ్ళటము, అద్దెకారులో వెళ్ళి ఊరు చూడటము, నడుమనడుమ మంచి రెస్టారెంటులకు వెళ్ళటము అంతా సరదాగా....సంతోషంగా గడిచి పోయింది. పట్టణములోఉంటూ పట్టణసౌకర్యాలను అనుభవించలేక పోవటమా?

ఇక్కడినుంచి వెళ్ళిన తరువాత పినతల్లికూతురు దంపతులను అభినందిస్తూ ఒక పెద్దఉత్తరము వ్రాసింది "భావనారాయణ చాల మర్యాదతెరిగిన యోగ్యుడట. భార్య సరదాలన్నీ ఇట్టే తెలుసుకొని అట్టేతీర్చే మనిషట. పూజ కొద్దీ పురుషుడట...." ఏమిటేమిటో ఇంకా చాలా వ్రాసింది. చదవటానికి తనకెంతో సిగ్గనిపించింది.

ఆమె ఉన్న నాలుగు దినాలు నిజంగా తనకెంతో కష్టమనిపించింది. తన పెనిమిటి సణగటము ఆమె చెవిన ఎక్కడ పడుతుందోనని భయపడుతునే ఉంది. 'రాబడికి మించిన ఖర్చనీ, డబ్బు విలువ తెలియదనీ నిర్దాక్షిణ్యంగా పురమాయించటమే కాని ఆదాయము చూసుకోవద్దా' అని ఏమేమిటో ఒకటే రొద చెవిలో. మర్యాద ఎట్లా వస్తుంది? డబ్బు పెట్టి కొంటే వస్తుంది. వాళ్ళ యింట్లో వాళ్ళుం

టేను మన యింట్లో మనముంటేను, ఎవరి డబ్బు వారి సంచిలో ఉంటేను, మర్యాదలు వస్తాయా? డబ్బు ఖర్చయితే తిరిగి సంపాదించగలము, కాని పోయిన మర్యాద తిరిగిరాదు. డబ్బుకు సంబంధించనంతవరకు ఆయనకూడా సరదా మనిషే. కాని అక్కడే వస్తోంది పేచీ.

ఈ దీపావళికి చీరె కొనటములో ఏమి కథ జరుగనున్నదో! తన తల్లి ఈసారి తప్పకుండా అడుగుతుంది ఏ చీరె కొన్నావని, అప్పుడే ఎటువంటివి కొంటావని ఇరుగుపొరుగు అడుగుతున్నారు. వాళ్ళకు సమాధానాలు చెప్పలేకపోతున్నది. తన మాట నెగ్గుతుందో నెగ్గదో యీసారి! ఇంతకూ ఎవరేమన్నా.... ఎంత హేళన చేసినా.... ఒక చీరె ఈ పండుగకు తెచ్చెనా.... కాసేపటిలో అందరి నోళ్ళూ మూతపడతాయి

రాజ్యలక్ష్మికివే ఆలోచనలు! వస్తోంది పండుగ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ.... పరుగులతో!

*   *   *   *

భావనారాయణ కలెక్టరు ఆఫీసులో గుమాస్తా. వారాలు చేసుకొని భోజనము చేస్తూ, రోడ్డు మీద వెలుగుతున్న దీపాల దగ్గర చదువుకుంటూ, చిన్న చిన్న పిల్లలకు అయిదు రూపాయల చొప్పున రెండు ట్యూషన్లు చెప్పుతూ మెట్రికు చదవటమే కష్టమయి పోయింది.

అధికారుల చుట్టూ కాళ్ళరిగిపోయేటట్టు తిరిగి ఆ ఉద్యోగము సంపాదించుకున్నాడు. కులాల సమస్య ప్రబలంగా ఉన్న కాలము కాబట్టి ఎంత ప్రయత్నించినా పైకి ఎక్క రాలేకుండా ఉన్నాడు.

చేసే చాకిరి మాత్రము జీతము కంటె అధికము. తరగని దొంతరల కొద్దీ కాగితాల కట్టలు! ఉదయము పది గంటలకు వంచిన నడుము సాయంత్రము ఆరు గంటలకే ఎత్తటము. నడుమ ఒక్కసారి టీ త్రాగటానికి అక్కడినుంచి కదులుతాడు. అంతే.

తొందరలో ఉదయము తొమ్మిది గంటలకు ఉడికీఉడకని వంటకాలతో భోజనమూ, పగలు రెండు గంటలకు ఒక కప్పు టీ నీళ్ళూనూ ఆ మానవాకారపు

ఇంజనులో పడే సరుకు, సాయంకాలము ఆరు గంటల తరువాత బయలుదేరి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వస్తాడు. అతని జీవితములో ఇబ్బంది లేకుండా వృత్తి గడచిన దినమే పర్వదినము.

భార్యను కాపురానికి తీసుకొని వచ్చేనాడు అతని హృదయము ఉప్పొంగి పోయింది. తన కష్టసుఖాలలో భాగము తీసుకోవటానికి—తనకై మానసికంగా కలిగే గాయాలను మాన్పటానికి—ఈ జీవితయాత్రలో తోడునీడగా ఉంటుందని హృదయపూర్వకంగా నమ్మాడు.

కాని గులాబీలోని అందము సౌరభము అతనికి కనబడలేదు. తాకగానే ముళ్ళ మాత్రము చేతికి తగిలాయి. కంటకభూయిష్ఠమైన ఆ గులాబితోనే........ ఏం చేస్తాడు?

భార్య కాపురానికి వచ్చిన దగ్గర్నుంచీ అతనికి కచేరిలో ఏ విధమయిన మర్యాద ఉన్నదో ఇంట్లోనూ అంతే. నాన్ గెజిటెడ్ ఆఫీసరు!

ఈ కాలానికి తగినట్లుగా—ఆధునిక ఆదర్శాలతో—జీవితము గడపాలని ఆమె కోరుతుంది. అది అతని కసాధ్యమవుతున్నది.

కచేరిలో కొంతవరకు, తన పని తాను చేసుకుంటూ, ఎవ రేదిన్నదృష్టి చూసినా తనను కాదని తిరుగవచ్చును. కాని యింట్లో జరిగే హంగామాలను తనను కాదనుకొని ఎట్లా ఊరుకోగలడు?

గుండె గుభేలుమనేటట్లుగా యీ దీపావళి వస్తున్నది. తన ఆర్థిక పరిస్థితిని గమనించకుండా ఒకచీరె కొనమని జులుమానా విధించింది రాజ్యలక్ష్మి.

అతని జీతము, పట్నమనివాడితే. అ పట్నములో ఒకరికే సరిపోతుంది. ఆ బస్తీలో నీళ్ళ దగ్గర్నుంచీ కొనుక్కుంటూ—కొద్దిజీతములో బ్రతకటమే కష్టముగా ఉంటే—ఈ పండుగ రావడమేమిటి అతని ప్రాణముమీదికి!

అక్కడికీ, కటుకు స్వభావము కాదు కాబట్టి, సామరస్యముతో కూడిన జీవితమే కోరుతూ, ఒకనాటికయినా పరిస్థితులు చక్కబడతాయేమోనన్న ఆశతో, జీతము ఖర్చుకాగానే బాకీలుచేస్తూ నెలపొడుగునా ఆమె కనుగుణంగానే నడుచు

కుంటాడు. బాకీలు చిన్నవల్లా పెద్దవయి మార్వాడీలదాకా వచ్చేశాయి. ఇంతఅయినా ఏ పూట కేమిప్రళయము వస్తుందో నన్న భయము ఎప్పటికప్పుడు కలుగుతూనే ఉంటున్న దతనికి.

ఆమె వినోదవిలాసాలు, తలచుకొన్నప్పుడల్లా, సహకూర్పలేకపోతున్నాడు. ఈమధ్య భార్య అతనినిగూర్చి కొత్త సమాసము వాడటము మొదలుపెట్టింది. 'అయినదానికి కానిదానికి అప్రయోజక చక్రవర్తిలాగ చేయకండి' అని. ఏ విషయంలో నయినా ఆమె తలిదండ్రులు ఆమె పాటకు తాళముపేయటమే కాని బుద్ధులు నేర్పేటట్లు కనపడదు. తమ బిడ్డకు రెండుపూటలా కాఫీ ఏర్పాట్లులేవని ఒకసారి వాళ్ళుచేసిన గొడవ అంతా భావనారాయణకు చెళ్లుమ పెట్టినట్లుగా కనబడ్డది.

రాజువలె తనను గౌరవించవలసిన అత్తమామలు గడ్డిపరకలాగ చూసిన, దేవుడిలాగ చూసుకోవలసినభార్య తృణీకరించిన బ్రతుకు తనది. ఎంత కష్టపడినా ఎదుగుబొదుగులులేని ఉద్యోగములో తన భార్యకు ఏ విధంగా తృప్తికలిగిస్తాడు పండుగ చీరెలు, పట్టు సౌందర్యాలు, ఆధునిక వేషాలు, ఎట్లా తన బ్రతుకు!

చాలీచాలని జీతములో అరకొర భోజనముతో దినదిన గండముగా ఉన్న అతని కఠోరజీవితానికి ఎవరయినా 'దీర్ఘాయుష్మంతుడవు కమ్మ'ని దీవిస్తే-అతని హృదయములో అరనిజ్వాలలు విజృంభిస్తాయి. అందరికి అది దివ్య దీపావళి కాని, అతనికి మాత్రము.........

సంతానము ఏర్పడకముందే తనబ్రతుకు ఏ దినమున కాదినము సమస్యగానే ఉన్నది. స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యము రావాలని పెద్ద సంచలనము కలుగుతున్నది దేశములో. అది ఏ బాపతో? స్త్రీలకు సంఘములో స్థానము లేదంటారు గాని తన యింట్లో తనకే స్థానములేదు, నిజము విచారిస్తే, పెద్దలను సలహా అడిగితే తన భార్యకు ఏ విధమయిన స్వాతంత్ర్య మివ్వమని సలహాయిస్తారో?

* * * * *

ఆరోజు ఒక్కరోజే విరామము. తెల్లవారితే నరక చతుర్దశి. పండుగ వస్తున్నది పరుగులతో!

భావనారాయణ ఎక్కినగడప ఎక్కకుండా స్నేహితుల ఇళ్లన్నీ తిరిగాడు చేబదులుకోసము. తనకు తెలిసిన బట్టలవర్తకు లెవరూ దీపావళి ముందర అరువు యివ్వరాయెను.

క్రుంగిపోయే నాడులతో ఇంటి ముఖమవుతున్నాడు. ధుమధుమలాడే రాజ్యలక్ష్మి ముఖమూ, ఆమె ఎత్తి పడవేసే గిన్నెలు చెంబులు అతని మనోవీధిలో సంచరిస్తూనే ఉన్నాయి!

ఇంతలో దేవుడిలాగ చిన్ననాటి స్నేహితుడు మల్లికార్జునరావు కనబడి 'ఎంతవరకు నీ ప్రయాణము' అని అడిగాడు. కళ్లనీళ్ళతో తన పరిస్థితి అంతా చెప్పుకొని ఏభయి రూపాయలుంటే యిమ్మని ప్రాధేయపడ్డాడు.

"మా యింటిభాగ్యము నీ వెరుగనిదా! నేనింకా పిల్లల తండ్రిని. మా యింట్లో పురుడు వచ్చేరోజులని సరిగా ఏభయి రూపాయలు మందులకని ఉంచాను. నీకిస్తే ఆ సమయానికి యివ్వగలవా?" అన్నాడు.

భావనారాయణకు అమృతము చిలికినట్లయింది. మల్లికార్జునరావుకు అతని తత్వమూ పరిస్థితీ బాగుగా తెలుసును, కాని తనకుగూడ పరీక్ష సమయముగానే ఉన్నది.

"నీవు సమయానికివ్వలేకపోయినా నేనెట్లాగో తంటాలు పడతాను. ఒక పాతిక తీసుకో" అంటూ యింటికి తీసుకొనివెళ్ళి యిచ్చాడు.

త్రోవలోనే ఒక చీరెకొని యింటిమార్గము పట్టాడు భావనారాయణ.

* * * * *

పండుగనాడు కట్టిన కొత్త చీరె తళతళతో రాజ్యలక్ష్మి చాలా హడావడిగా తిరుగుతూ దీపాలు పెట్టున్నది. పండుగ భోజనమువల్ల కలిగిన ఆయాసంతో ఆ చీరె తనకొక లెక్కలోది కాదనీ, ఇంకా మంచిదే కొనాలనుకున్నారు కాని నాలుగు దుకాణాలు తిరుగలేక యిప్పటికాచీరె తెచ్చారనీ, ఇంకా రెండునెలలలో సంక్రాంతి రానే వస్తోందికదా అప్పటికి మంచి చీరె కొంటానని భర్త వాగ్దానము చేశాడనీ, కనబడ్డ వాళ్ళందరితోటీ చెప్తున్నది రాజ్యలక్ష్మి.